

నీటి పొదుపుపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, కాలనీవాసులు

నీటిని పొదుపుగా వాడాలి

పేట్‌బషీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎండలు రోజురోజుకు పెరుగుతున్నాయని, నీటి సమస్య ఎక్కువవుతున్న కారణంగా నీటిని పొదుపుగా వాడాలని రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శనగర్ అభ్యుదయ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, కాలనీవాసులతో ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ నీటి దినోత్సవంలో భాగంగా ఈనెల 22 నుంచి 28 వరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్ గ్రామం, జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్, ఐడీపీఎల్, నందానగర్‌లో ర్యాలీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నీటిపొదుపుపై అవగాహన కల్పించారు. నీటి విలువ తెలియజేసేందుకే ఏటా ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకుంటామని అభ్యుదయ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు అశోక్ అన్నారు. నీరు అనేది మన ప్రాథమిక హక్కు అని, మానవ అభివృద్ధికి నీరు ఎంతో అవసరమనే సత్యాన్ని తెలియజెప్పడమే ఈ కార్యక్రమ ప్రధానోద్దేశం అన్నారు. నీటిని సంరక్షించడం మన అందరి బాధ్యత అని, ఇంటింటికీ ఇంకుడు గుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకరయ్య, అభ్యుదయ ఎడ్యుకేషన్ సొసైటీ కో-ఆర్డినేటర్లు మధులత, ప్రభ, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

నిజాంపేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పగడ్బందీ చర్యలు తీసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ అన్నారు. వేసవికాలంలో తాగునీరు సరఫరాపై శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో నీటి సమస్యల లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లీకేజీలు, వాటర్ సమస్య వచ్చినప్పుడు తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని సూచించారు. వాటర్ వర్క్స్ డీజీఎం మహేశ్వరరావు, ఏఈ వసుధ, ప్రవీణ్‌కుమార్, మేనేజర్ నర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉమెన్ సేఫ్టీ కార్యక్రమంలో ఎస్సీఎస్సీ మహిళా ప్రతినిధులు

మహిళలకు స్వీయరక్షణపై శిక్షణ

హైదరాబాద్ సిటీ మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఉమెన్ సేఫ్టీ మంత్‌లో భాగంగా సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) ఉమెన్స్ ఫోరం ఆధ్వర్యంలో కమిషనరేట్‌లో శనివారం మహిళ రక్షణ గురించిన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి కమిషనరేట్ పరిధిలోని ఐటీ, ఆస్పత్రి, హోటల్, ఫార్మా సంస్థల్లో పని చేస్తున్న మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఒంటరిగా ప్రయాణం చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గృహహింస, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేధింపులు, పని ప్రదేశంలో వేధింపుల గురించి ఫిర్యాదు చేసే విధానం గురించి ఎస్సీఎస్సీ సభ్యులు ప్రత్యూషశర్మ వివరించారు. లక్ష్మీ సుబ్రహ్మణ్యం టీమ్ ఆధ్వర్యంలో సదస్సులో పాల్గొన్న మహిళలకు కరాటే, కలరిపయట్టులపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ చైల్డ్ సేఫ్టీ డీసీపీ సృజన కరణం, ఏసీపీ ప్రసన్నకుమార్, ఇన్‌స్పెక్టర్ సునిత సర్వేలతో పాటు ఎస్సీఎస్సీ సభ్యులు విష్ణుప్రియ సక్సేనా, పద్మప్రియ చిలకమర్తి, సోనియా సెహెగల్, మాలతి మర్రిశెట్టి, భారతి ఇంద్రగంటి, హరిణి మదిరా, లిలితాటిమ్స్‌తోపాటు పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు రాజేష్‌ఖన్నాకు జేఎన్‌టీయూ డాక్టరేట్


రాజేష్ ఖన్నా

జేఎన్‌టీయూ, మార్చి30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు భూ త్కూరి రాజేష్ ఖన్నాకు పవర్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ డ్రైవ్స్ స్పెషలైజేషన్‌లో చేసిన పరిశోధనలకు జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. డా.పూనమ్ ఉపాధ్యాయ పర్యవేక్షణలో పరిశోధనలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో యూనివర్సిటీ కాలేజ్ ఈఈఈలో ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తూనే గేయ రచయితగా పేరు సంపాదించిన రాజేష్ ఖన్నాకు డాక్టరేట్ రావడం పట్ల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సంతోషం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


కాంగ్రెస్‌లో చేరుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం కాంగ్రెస్ గూటికి చేరారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


'కాంగ్రెస్‌లో చేరడం దారుణం'

హైదర్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జెండా మీద ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచిన దొడ్ల వెంకటేష్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం దారుణమని బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్‌నేత అన్నారు. బీఆర్ఎస్ జెండామీద గెలిచిన కార్పొరేటర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ గురువులైన ఎమ్మెల్యేలు కృష్ణారావు, అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ నవీన్‌రావును కాదని ఎందుకు వెళ్లినట్లు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పార్టీ కార్యకర్తల కష్టంతో గెలిచిన నువ్వు వారికి క్షమాపన చెప్పి కార్పొరేటర్ పదవికి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు.


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు

రంజాన్ ఉపవాస దీక్షలు

హైదర్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పురస్కరించుకుని హైదర్‌నగర్ డివిజన్ మసీద్‌లో నిర్వహించిన దావత్-ఏ ఇఫ్తార్ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రమైనదని, నిష్టతో ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.


ముద్దం నర్సింహ్మాయాదవ్‌తో సమావేశమైన దళిత నాయకులు

జగ్జీవన్‌రాం జయంతి నిర్వహణపై సమీక్ష

ఓల్డుబోయినపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 5 నిర్వహించ తలపెట్టిన బాబు జగ్జీవన్‌రాం జయంతి నిర్వహణపై ఓల్డుబోయినపల్లి డివిజన్ దళిత ఐక్యవేదిక నాయకులు శనివారం కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్‌తో సమావేశమయ్యారు. జయంతి రోజు నిర్వహించే కార్యక్రమాలపై చర్చించి కార్యచరణను సిద్ధం చేశారు. సమావేశంలో మైనారిటీ నాయకులు సయ్యద్‌ఎజాజ్, దళిత ఐక్యవేదిక నాయకులు గడ్డం నర్సింహ, బుర్రి యాదగిరి, బాల నర్సింహ, రాజేందర్, జగదీష్, శశికళ, రోజా, ప్రదీప్, రాజు, శివ సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యాపారవేత్తలు లక్ష్యాలకు కట్టుబడి ఉండాలి

టీ హబ్‌లో టాక్స్ ఫిల్లింగ్ ఇండియా నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డులు


పారిశ్రామిక వేత్తలకు అవార్డులను అందజేస్తున్న ముఖ్యఅతిథులు, నిర్వాహకులు

రాయదుర్గం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్తలు తమ లక్ష్యాలకు కట్టుబడి ఉన్నప్పుడే అనుకున్న విజయాలను సాధిస్తారని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. తెలంగాణాలోని పారిశ్రామిక రంగాల్లో ప్రతిభను చాటుకున్న 60 మంది అత్యుత్తమ పారిశ్రామికవేత్తల విజయాలను కీర్తిస్తూ ట్యాక్స్ ఫిల్లింగ్ ఇండియా నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని టీ హబ్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్, ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్ జీవన్‌లాల్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని అన్నారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ.. విజయం సాధించడంలో దృఢసంకల్పం, ఆత్మవిశ్వాసం అవసరమన్నారు. ఆదాయ పన్ను కమిషనర్ జీవన్‌లాల్ మాట్లాడుతూ.. భారతీయ యువతలో మారుతున్న ఆలోచనా ధోరణిని ఎత్తి చూపారన్నారు. సాంప్రదాయ ఉపాధిని పొందాలనే కోరిక కంటే ఉపాధి అవకాశాలను సృష్టించాలనే కోరిక ఎక్కువగా ఉందన్నారు. నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డుల వంటి ఈవెంట్‌ల ద్వారా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గౌరవించడం ప్రపంచ వేదికపై భారత దేశ ఆర్థిక వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తుందన్నారు. ట్యాక్స్ ఫిల్లింగ్ ఇండియా, నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డ్స్ వ్యవస్థాపకుడు చల్లూరి శ్రీనివాస్, వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిహెచ్ వీర భద్ర సహకారంతో ఈ అవార్డులను అందజేసి ప్రతిభావంతులైన పారిశ్రామిక వేత్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కమాండో శ్రీవాత్సవ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, మల్లారెడ్డి, నారాయణ హెల్త్‌సిటీ డైరెక్టర్ డాక్టర్ ప్రీతీ రెడ్డి, హరి, విమలక్క, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

హాష్ ఆయిల్ విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

దుండిగల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న యువకుడిని బాలానగర్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దుండిగల్ మండలం, మల్లంపేట, సాయిబాలాజీ ఎస్ఆర్‌కె హోమ్స్ విల్లా నెం.12లో నివాసం ఉంటున్న రామ్మోహన్‌రావు కుమారుడు కనగల ఉదయ్‌కుమార్(29) డాగ్‌బ్రీడర్‌గా పని చేస్తాడు. గండిమైసమ్మలోని రాజు బస్తీలో హ్యాష్ ఆయిల్‌ను విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. అక్కడ చెట్ల పొదల్లో అనుమానాస్పదంగా కనిపించిన యువకుడిని పోలీసులు ప్రశ్నించగా తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. దీంతో ఉదయ్‌కుమార్‌ను గట్టిగా పోలీసులు విచారించగా చెట్ల పొదల్లో దాచిన హాష్ ఆయిల్ బ్యాగ్‌ను తీసుకొచ్చాడు. అందులో 90 గ్రాములు హ్యాష్ ఆయిల్, రూ.11 వేలు నగదు, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.


అంబీర్‌చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, నిజాంపేట డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

అంబీర్‌చెరువును అందంగా తీర్చిదిద్దుతాం

హైదర్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చెరువులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తున్నామని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని అంబీర్‌చెరువును నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ సురేష్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కతో దోమలు పెరిగి స్థానికులు పడుతున్న ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువుల శుభ్రతకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇద్దరి మృతికి కారణమైన ఫిట్‌నెస్ లేని లారీ.. లైసెన్స్‌లేని డ్రైవర్

● రోడ్డు ప్రమాదం కేసులో ముగ్గురి అరెస్టు ● పరారీలో డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థ ఎండీ

బోయినపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని లారీతో లైసెన్స్ లేని డ్రైవర్ చేసిన ప్రమాదం వల్ల రెండు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి లారీ యజమాని మరో నేరం చేశాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ స్థానంలో నకిలీ డ్రైవర్‌ను చూపించి పోలీసులను తప్పుదోవ పట్టించాడు. దర్యాప్తు చేసిన పోలీసులు లారీ యజమానితో పాటు.. ప్రమాదానికి కారణమైన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో లారీ డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ ఎండీ పరారీలో ఉన్నారు. శనివారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో నార్త్‌జోన్ శాంతి భద్రతల విభాగం డీసీపీ రోహిణి ప్రియదర్శిని, ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడుతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేడ్చల్ జాతీయ రహదారిలోని మిలటరీ డైరీఫాం సమీపంలో లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. అక్కడ ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మార్చి 24 అర్ధరాత్రి 44వ పిల్లర్ వద్ద భారత్ ఫైబర్ కేబుల్‌కు సంబంధించిన వైర్లు కిందపడ్డాయి. అవి తగిలి ఓ వాహనదారుడు కిందపడ్డాడు. వైర్లను తొలగించే క్రమంలో వాహనాలు ఆగాయి. అదే సమయంలో సుచిత్ర నుంచి వేగంగా వస్తున్న లారీ ముందున్న రెండు బైక్‌లను ఢీకొంది. ఈ ఘటనలో ఓ బైక్‌పై ఉన్న ఆకాశ్‌రాజ్, నందిని అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న బోయినపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

● డ్రైవర్‌ను మార్చేసి, పోలీసులను ఏ మార్చి

ప్రమాదానికి కారణమైన లారీకి ఫిట్‌నెస్ లేదని, డ్రైవర్‌కు లైసెన్స్ లేదని తెలిసిన లారీ యజమాని ఎలాగైనా కేసు నుంచి బయటపడాలని ప్లాన్ వేశాడు. పారిపోయిన డ్రైవర్ స్థానంలో లైసెన్స్ ఉన్న నకిలీ డ్రైవర్‌ను పెట్టి పోలీసులకు అప్పగించాడు. ఈ కేసులో భద్రత చర్యలు తీసుకోకుండా ఫ్లైఓవర్ పనులు చేస్తున్న సంస్థ మేనేజర్ విజయవాడకు చెందిన కె.రాఘవేంద్ర, ఖైరతాబాద్‌కు చెందిన భారత్ ఫైబర్‌నెట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం పూర్ణచందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో లారీ నడిపిన డ్రైవర్ లొంగిపోయిన వ్యక్తి కాదని, వేరే వ్యక్తి అయి ఉంటాడని పోలీసులకు అనుమానం వచ్చింది. లొంగిపోయిన డ్రైవర్‌ను తమదైన శైలిలో విచారించగా యజమాని సూచనతోనే లొంగిపోయానని అతడు వెల్లడించాడు. అతడిచ్చిన సమాచారంతో మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన లారీ యజమాని అర్జున్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిర్మాణ సంస్థ లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ వేములపల్లి కిరణ్‌కుమార్, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఉర్విషేక్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగరాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

గాజులరామారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగరాలని, మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే గాజులరామారం ఆక్సిజన్ పార్కులో వాకర్స్‌తో ముచ్చటించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతం పేరుతో బీజేపీ, అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మల్కాజిగిరి పార్లమెంట్‌లో ఉన్న సమస్యలపై అవగాహన లేదన్నారు. కార్పొరేటర్ శేషగిరి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్. గాజులరామారం డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రామిరెడ్డి, నాగరాజు యాదవ్, బాలరాజ్, చిన్నా, మహేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

మియాపూర్: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి అన్నారు. మియాపూర్ నరేన్ గార్డెన్స్‌లో శనివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజలను ఓట్లు అడుగుతానన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళలకు న్యాయం

నిజాంపేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు న్యాయం జరుగుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలుగా గంగుల అంజలియాదవ్, ప్రధాన కార్యదర్శిగా రషియా బేగం నియమితులయ్యారు. మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి వీరిని ప్రతిపాదించగా, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితా మొగిలిరావు నియమించారు. ఈ నియామకపత్రాన్ని కొలన్ హన్మంత్‌రెడ్డి కార్యాలయంలో శనివారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం నిత్యం పని చేస్తూ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు సుజాతా యాదవ్, శ్రీలత, ఫరీనాబేగం, నాగభవాని, శోభారెడ్డి పాల్గొన్నారు.


నియమకపత్రాలు అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు

పేట్‌బషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ప్రజలకు మేలు చేస్తుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కెఎం ప్రతాప్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు కుత్బుల్లాపూర్ గ్రామంలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. బిజిలి కృష్ణ, చంద్రశేఖరరెడ్డి, బాల్‌రాజు, శ్రీనివాస్, బిజిలి శంకర్ పాల్గొన్నారు.

హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ షురూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం ఉల్లాసంగా జరిగింది. శనివారం నగరంలోని లేక్‌వ్యూ టెన్నిస్ అకాడమీలో రాష్ట్ర ఏసీబీ డీజీ సీవీ ఆనంద్, హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం (హెచ్ఓటీఏ) అధ్యక్షుడు, మాదాపూర్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ టోర్నీలో దేశవ్యాప్తంగా 300 మందికి పైగా క్రీడాకారులు పోటీ పడుతున్నారు. పురుషుల ఓపెన్ కేటగిరీలో 30, 40, 50, 60, 70 ప్లస్ వయో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. అన్ని విభాగాల్లోనూ విజేతకు రూ.3 లక్షల నగదు బహుమతిని అందించనున్నారు. ప్రారంభ వేడుకల్లో హెచ్ఓటీఏ కార్యవర్గసభ్యులు శ్రీనివాస్, సదాశివరెడ్డి, రమణ, మెహర్, చక్రి తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న సీవీ ఆనంద్ తదితరులు

రన్‌ఫర్ జీసస్ ర్యాలీ

రెజిమెంటల్‌బజార్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండగ నేపథ్యంలో నిర్వహించిన రన్‌ఫర్ జీసస్ ర్యాలీని శనివారం సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ బసలికా చర్చి ఆవరణలో కార్డినల్ బిషప్ పూల ఆంథోని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీని ప్యాట్నీ, ట్యాంక్ బండ్ మీదుగా ఆబిడ్స్ సెయింట్ జార్జియస్ స్కూలు వరకు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెథడిస్ట్ బిషప్ ఎంఏ డానియల్, థెరిస్సాపాల్, పాల్‌దేవప్రియం, ఉషాపాల్ పాల్గొన్నారు.


మూసాపేట ఇఫ్తార్ విందులో పట్నం సునీతారెడ్డి, హరివర్ధన్‌రెడ్డి తదితరులు

రాజీవ్ గాంధీనగర్‌లో ఇఫ్తార్ విందు

బాలానగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధి రాజీవ్ గాంధీనగర్‌లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖాజ, యం.డి. బాబా, సోఫీ, డి. కృష్ణమూర్తి, అరబ్ బస్తీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, యం.డి మొయిజ్ పాల్గొన్నారు.

● మూసాపేటలో..

కూకట్‌పల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు కాంగ్రెస్ మల్కాజ్‌గిరి అభ్యర్థి పట్నం సునీతారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, స్థానిక నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత సామరస్యాన్ని చాటేలా రంజాన్ పండుగ నిర్వహించడం ఎంతో సంతోషమన్నారు. ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేరి సతీష్‌రెడ్డి, తూము వేణు, సంజీవరావు, మేకల మైఖేల్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనే నాయకత్వం అవసరం

నావల్ వైస్ అడ్మిరల్ డీకే త్రిపాఠి


ప్రతిభ కనపర్చిన అధికారికి ట్రోఫీని అందిస్తున్న వైస్ అడ్మిరల్ డీకే త్రిపాఠి

అల్వాల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మేధస్సుతో బలమైన శత్రుదేశాలను కూడా వ్యూహాత్మక ఎత్తుగడలను అనుసరిస్తూ ముందుకు వెళ్లడానికి హైబ్రిడ్ వార్‌ఫేర్ పట్ల త్రివిధ దళాలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని వైస్ అడ్మిరల్ డీకే త్రిపాఠి అన్నారు. శనివారం సికింద్రాబాద్ సైనిక్‌పురిలోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌లో 165 మంది మంది త్రివిధ దళాల అధికారులకు, మిత్రదేశాలకు చెందిన అధికారులకు 44 వారాల పాటు హయ్యర్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్-19 కోర్సులో శిక్షణ అందించారు. కోర్సు ముగింపు కార్యక్రమానికి నావల్ వైస్ అడ్మిరల్ డీకే త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరై సైనిక అధికారులనుద్దేశించి మాట్లాడారు. సంక్లిష్ట భద్రతా వాతావరణం, జాతీయ విజన్ 2047కి అనుగుణంగా రాష్ట్రా నిర్మాణ్ సాధించడానికి విభిన్న పద్ధతులను ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్నటువంటి మార్పులకు అనుగుణంగా సాయుధదళాల్లో వ్యూహాత్మక ఎత్తుగడలను, వాటిరూపు రేఖలను మార్చుకోవాలన్నారు. దేశానికి ప్రసుత్త పరిస్థితుల్లో సవాళ్లను ఎదుర్కొనే నాయకత్వం అవసరమన్నారు. బంగ్లాదేశ్, భూటాన్, ఘనా, కెన్యా, మలేషియా, మయాన్మార్, నేపాల్, నైజీరియా, సౌదీఅరేబియా, శ్రీలంక దేశాలకు చెందిన అధికారులకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంఎంఎస్)లో డిగ్రీ, ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎఐఎంఎ) అడ్వాన్స్ కోర్స్ ఇన్ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికేట్‌ను పొందారు. సీడీఎంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మంచి శిక్షణను అందిస్తున్నారని త్రిపాఠి కొనియాడారు. అంతకు ముందు ఆయన కళాశాల ఆవరణలో సర్దార్ పటేల్, స్వామి వివేకానంద విగ్రహాలను ఆవిష్కరించారు.

నరేంద్రమోదీకి దేశ ప్రజల అండ: ఈటల


బాలాజీనగర్ డివిజన్‌లోని స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్‌వాసులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాటు దేశంలో సుస్థిర పరిపాలన అందించిన ప్రధాని నరేంద్రమోదీకి దేశ ప్రజలు అండగా నిలబడుతున్నారని బీజేపీ మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బాలాజీనగర్ డివిజన్‌లోని స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్స్‌వాసులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. మన దేశం అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరుకొందన్నారు. ఎన్నికల్లో మరోసారి బీజేపీని గెలిపించి మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని ఈటల కోరారు.

ఈటల గెలుపు కోసం పని చేయాలి

పేట్‌బషీరాబాద్: ఈటల రాజేందర్ గెలుపు కోసం అందరూ పని చేయాలని జీడిమెట్ల కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్, కుత్బుల్లాపూర్ గ్రామంలోని ఈటల జమున, తారా చంద్రారెడ్డి బీజేపీ కార్యాలయంలో ఎన్నికల ప్రచారంపై డివిజన్ మహిళా నాయకులతో సమావేశం నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు పులి బలరామ్, బీజేపీ మహిళా నాయకులు ఝాన్సీ, బాబీనీల, డివిజన్ నాయకులు ప్రతాప్, కృష్ణ పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించండి

ఫతేనగర్: బీజేపీని మరోసారి గెలిపించి మోదీని ప్రధానిగా చేయాలని ఈటల రాజేందర్ కూకట్‌పల్లి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఫతేనగర్ డివిజన్ పరిధి ఓల్డు ఎయిర్‌పోర్టు రోడ్డు, భరత్‌నగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కైత్లాపూర్ మైదానంలో క్రికెట్ ఆడుతున్న యువకులను కలిసి తనకు ఓటు వేయాలని కోరారు.

నేడు కోయబస్తీ చాముండేశ్వరి ఆలయ వార్షికోత్సవం

ఓల్డుబోయినపల్లి: ఓల్డుబోయినపల్లి డివిజన్ హస్మత్‌పేట కోయ బస్తీ చాముండేశ్వరి ఆలయం వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబైంది. ఆదివారం జరిగే ఈ వేడుకల్లో అమ్మవారికి అభిషేకం పూజల అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏప్రిల్ 4 వరకు అన్నమయ్యపురంలో శిఖర ప్రతిష్ఠ

మాదాపూర్: మాదాపూర్ అన్నయ్యపురంలో అన్నమయ్య సమేత వరసిద్ధి వేంకటేశ్వరస్వామి శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం ఆదివారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు పద్మశ్రీ డాక్టర్ శోభారాజు శనివారం తెలిపారు. 31వ తేదీన విశేష కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. చినజీయర్ స్వామి హాజరవుతారని తెలిపారు.